ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తమిళనాడు
TAMILNADU
శుక్రవారం 6 సెప్టెంబరు 2024



# 'ది గోట్' సందడి

- విజయ్ బ్యానర్లకు పాలాభిషేకాలు
- థియేటర్ల వద్ద అన్నదానాలు
- రాష్ట్రవ్యాప్తంగా ఫ్యాన్స్ ఆనందోత్సవాలు


విజయ్ కటౌట్‌కు పుష్పాభిషేకం


కోయంబేడులోని రోహిణి థియేటర్ వద్ద అభిమానుల సందడి


టీవీకే పతాకంతో అభిమానులు

అడయార్, సెప్టెంబరు 5: అగ్రహీరో విజయ్ - దర్శకుడు వెంకట్ ప్రభు కాంబినేషన్‌లో రూపొందిన 'ది గోట్' చిత్రం గురువారం ప్రపంచ వ్యాప్తంగా విడుదలైంది. ఈ చిత్రం తొలి ఆట గురువారం వేకువజామున 4 గంటలకే ప్రదర్శించారు. దీంతో విజయ్ అభిమానులు థియేటర్ల వద్ద బారులు తీరారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది. పైగా ఈ చిత్రం తొలి ఆట నుంచే పాజిటివ్ టాక్ సొంతం చేసుకుంది. అనేక థియేటర్ల వద్ద బాణా సంచా కాల్చారు. థియేటర్ల ముందు కట్టిన బ్యానర్లకు అభిమానులు పాలాభిషేకాలు చేశారు. మరి కొని థియేటర్ల వద్ద అల్పాహారాలు, మధ్యాహ్నం బిర్యానీ పంచారు. చిత్రం బ్లాక్‌బస్టర్ కావాలంటూ దళపతి ఫ్యాన్స్ దేవాలయాల్లో కూడా ప్రత్యేక పూజలు చేశారు.

ప్రముఖ నిర్మాణ సంస్థ ఏజీఎస్ నిర్మించిన ఈ చిత్రంలో విజయ్‌తో పాటు ప్రశాంత్, ప్రభుదేవా, యోగిబాబు, స్నేహ, లైలా, మీనాక్షి చౌదరి తదితరులు నటించగా, యువన్ శంకర్ రాజా సంగీతం అందించారు. ఇందులో విజయ్ తండ్రీకొడుకులుగా ద్విపాత్రాభినయం చేశారు.

## వైరల్ అవుతున్న కెప్టెన్ ఫొటోలు...

ఈ సినిమాలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీని ఉపయోగించి దివంగత నటుడు విజయకాంత్‌ను యంగ్ లుక్‌లో చూపించారు. ఈ ఫొటోలు వెండితెరపై కనిపించడంతో ప్రేక్షకులంతా నినాదాలు చేశారు. మరోవైపు, ఈ సినిమాకు రెండు రోజుల పాటు ప్రత్యేక షో ప్రదర్శనకు అనుమతివ్వాలని నిర్మాణ సంస్థ ప్రభుత్వాన్ని కోరగా, ఒక్క రోజు మాత్రమే అనుమతిచ్చింది. ముఖ్యంగా సినిమా క్లైమాక్స్ ఏకంగా 40 నిమిషాల పాటు కొనసాగినప్పటికీ అది ఎంతగానో ఆలరిస్తుందని ఫ్యాన్స్ చెబుతున్నారు.

## థియేటర్ల వద్ద అన్నదానం...

'ది గోట్' విడుదలైన పలు ప్రాంతాల్లో ఆయన అభిమానులు సందడి చేశారు. మధ్యాహ్నం అంబత్తూరుతో పాటు తిరునెల్వేలి, మదురై, తిరుచ్చి తదితర ప్రాంతాల్లో బిర్యానీతో అన్నదానం చేశారు. ఇదిలావుంటే, ఈ సినిమా తొలిరోజే దాదాపుగా రూ.వంద కోట్ల మేరకు వసూళ్ళు రాబట్టినట్టు కోలీవుడ్ వర్గాల సమాచారం. బెంగళూరులో సైతం ఈ సినిమా విడుదలైన థియేటర్ వద్ద విజయ్ ఫ్యాన్స్ టాపాసులు కాల్చి సంబరాలు జరిపారు.

## రాజకీయ అరంగేట్రానికి ముందు...

హీరో విజయ్ కొత్తగా తమిళగ వెట్రి కళగం (టీవీకే) పేరుతో పార్టీని స్థాపించడంతో పాటు ఇటీవల ఆ పార్టీ జెండా కూడా ఆవిష్కరించారు. వచ్చే నెలలో విల్లుపురం జిల్లా విక్రవాండిలో పార్టీ తొలి మహానాడు నిర్వహించనున్నారు. ఈ మహానాడు ముందు విజయ్ చిత్రం విడుదలకావడంతో ఆయన అభిమానులు, పార్టీ కార్యకర్తలు ఈ చిత్రాన్ని చూసేందుకు థియేటర్లకు క్యూ కట్టడం గమనార్హం. అయితే, కొన్ని థియేటర్ల వద్ద బ్యానర్లు, కటౌట్లను అధికారులు తొలగించడం గమనార్హం.



విజయ్ ఫొటో టీషర్టులతో యువతులు

## బంగాళాఖాతంలో
# అల్పపీడనం

- నగరానికి వర్ష సూచన

చెన్నై, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మధ్య, పడమటి బంగాళాఖాతంలో గురువారం అల్పపీడనం కేంద్రీకృతం కావటంతో రాజధాని నగరం, శివారు ప్రాంతాల్లో రెండు రోజులపాటు చెదురుమదురు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ పరిశోధనా విభాగం అధికారులు తెలిపారు. మరో రెండు రోజుల్లో ఈ అల్పపీడనం ఉత్తర వాయవ్య దిశగా కదులుతుందని, దీని ప్రభావంతో నగరంలో, పుదుచ్చేరిలో శుక్రవారం రాత్రి వరకూ ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయన్నారు. అదే విధంగా ఈ నెల 7 నుంచి 11 వరకు రాష్ట్రంలోని కొన్ని చోట్లా, పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లో చెదురుమదురుగా వర్షాలు కురుస్తాయని తెలిపారు. నగరానికి సంబంధించినంత వరకు ఆకాశం మేఘావృతమై ఉంటుందని, కొన్ని ఉరుములు, మెరుపులతో వర్షం కురుస్తుందని, ఉష్ణోగ్రత 35 నుంచి 36 డిగ్రీలు నమోదవుతుందని వివరించారు. కాంచీపురం, తిరువళ్లూరు, చెంగల్పట్టు జిల్లాలో ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపారు. శుక్రవారం సాయంత్రం లేదా రాత్రిపూట నగరంలో ఉరుములు, మెరుపులతో వర్షం కురుస్తుందని పేర్కొన్నారు.

## రాష్ట్రానికి
# మరో పెద్దకంపెని

- రూ.2వేల కోట్లతో ట్రిలియంట్ నెట్‌వర్క్స్
- సీఎం స్టాలిన్ సమక్షంలో కుదిరిన ఒప్పందం


సీఎం స్టాలిన్ సమక్షంలో ఒప్పంద పత్రాలను ప్రదర్శిస్తున్న ట్రిలియంట్ నెట్‌వర్క్స్ ప్రతినిధులు


చెన్నై, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అమెరికాలోని చికాగో నగర పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అక్కడి పారిశ్రామిక వేత్తలు, పెట్టుబడి దారులు, ప్రముఖ కంపెనీల ప్రతినిధులతో భేటీ అవుతూ బిజీగా గడిపారు. ఆ చర్చల పర్యవసానంగా ట్రిలియంట్ నెట్‌వర్క్స్ కంపెనీ రాష్ట్రంలో రూ.2 వేల కోట్ల పెట్టుబడి పెట్టేందుకు అంగీకరించింది. ఆ మేరకు స్టాలిన్ సమక్షంలో ఆ కంపెనీ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. స్మార్ట్ గ్రిడ్, స్మార్ట్ సిటీ, ఇండస్ట్రియల్ ఇంటర్‌నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ) రూపొందించటంలోను, ఇంధన ఉత్పత్తులు, ప్రత్యామ్నాయ ఇంధన ఉత్పత్తులు, మీటరింగ్ మౌలిక వసతులు కల్పించటంలో అగ్రగామి సంస్థగా ఉన్న ఈ కంపెనీ ప్రధాన కార్యాలయం అమెరికాలోని నార్త్ కరోలినా కేరీ నగరంలో ఉంది. బుధవారం రాత్రి చికాగో నగరంలో పెట్టుబడిదారుల సదస్సులో ముఖ్యమంత్రి స్టాలిన్ పాల్గొన్నారు. ఆ సందర్భంగా ట్రిలియంట్ నెట్‌వర్క్స్ అధినేతలతో పెట్టుబడుల సమీకరణపై సమగ్రంగా చర్చలు జరిపారు. రాష్ట్రంలో కొత్త పరిశ్రమలు పెట్టేందుకు ఉన్న అవకాశాలు, తమ ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను స్టాలిన్ వివరించారు. దీంతో ట్రిలియట్ నెట్‌వర్క్స్ తమిళనాట రూ.2000కోట్లతో డెవలప్‌మెంట్ అండ్ గ్లోబల్ సపోర్ట్ సెంటర్ నెలకొల్పేందుకు అంగీకరించింది. ఆ మేరకు అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ట్రిలియంట్ నెట్‌వర్క్స్ చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ మైక్ మార్టిమెర్ సంతకాలు చేశారు.

### మరికొన్ని కంపెనీలతో చర్చలు..

క్రీడా పాదరక్షల తయారీలో పేరున్న నైక్ కంపెనీ చీఫ్ సప్లయ్ చైన్ ఆఫీసర్ వెంకటేశ్ అలగిరిసామి, ప్రతినిధులు క్రిస్టన్ హన్‌సన్, జార్జి కాశిమిరేతో సీఎం చర్చలు జరిపారు. తోలురహిత పాదరక్షల తయారీకి రాష్ట్రంలో ఉన్న అవకాశాలను స్టాలిన్ వారికి వివరించారు. ఇదేవిధంగా యునైటెడ్ హెల్త్ గ్రూప్‌కు చెందిన ఓప్టమ్ బీమా సంస్థ ప్రతినిధులతోనూ ఆయన భేటీ అయ్యారు. ఆ సంస్థ సీఈఓ రోజర్ కొన్నర్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ జాన్ మేడీ పాల్గొన్నారు. ఈ చర్చల్లో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీఆర్బీ రాజా, పారిశ్రామిక పెట్టుబడుల ప్రోత్సాహక వాణిజ్యవిభాగం కార్యదర్శి వి. అరుణ్‌రాయ్, ప్రభుత్వ సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

## పీఎంశ్రీ పథకంపై వాగ్యుద్ధం...
## అప్పుడు అంగీకరించారు
# ఇప్పుడు వద్దంటున్నారు

- రాష్ట్ర ప్రభుత్వంపై గవర్నర్ రుసరుసలు
- కడుపుమంటతోనే ఆ విమర్శలు : మంత్రి ఉదయనిధి

చెన్నై, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు పెంచేందుకు, నాణ్యమైన విద్య నందించేందుకు పీఎంశ్రీ అత్యంత అవసరమంటూ ఈ పథకాన్ని అంగీకరించిన రాష్ట్ర ప్రభుత్వం.. ఆ తరువాత వ్యతిరేకించడం గర్హనీయమని గవర్నర్ ఆర్ఎన్ రవి ఆరోపించారు. రాజ్‌భవన్‌లో గురువారం ఉదయం ఉపాధ్యాయదినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశమంతా విద్యాభివృద్ధి పథకాల కోసం కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలతో ఒప్పందాలు కుదుర్చుకుని నిధులు మంజూరు చేస్తున్నదని, పీఎంశ్రీ ద్వారా రాష్ట్రాలకు అదనపు నిధులు మంజూరు చేయడానికి సిద్ధంగా ఉందని చెప్పారు. పీఎంశ్రీ పథకాన్ని అమలు చేయడానికి మొదట అంగీకరించిన రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం ఆ పథకమే వద్దని చెబుతోందని విమర్శించారు. దేశవ్యాప్తంగా 14500 పాఠశాలలను ఏర్పాటు చేయాలని కేంద్రప్రభుత్వం ప్రయత్నిస్తోందని, ఆ రీతిలోనే రాష్ట్రంలోని పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు, మౌలిక సదుపాయాలు కల్పించేందుకు పీఎంశ్రీ పథకం దోహదపడుతుందన్నారు.

### నాణ్యమైన విద్య అందించటం లేదు..

రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించడం లేదని, జాతీయ సగటు విద్యా ప్రమాణాల కంటే రాష్ట్రంలోని విద్యా ప్రమాణాలు తక్కువ స్థాయిలోనే వున్నాయని గవర్నర్ ఆరోపించారు. ప్రభుత్వ పాఠశాల్లో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థులలో 75 శాతం మంది ద్విసంఖ్యలను కూడా అర్థం చేసుకోలేని స్థితిలో ఉన్నారని, 40 శాతం మంది వారి పాఠ్యాంశాలను చదవలేరని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాబోధనలోని లోపాలే వీటన్నింటికీ ప్రధాన కారణమని గవర్నర్ ధ్వజమెత్తారు. ఈ విద్యార్థులంతా సులువుగా పాస్‌అవుతున్నారని, డిగ్రీలు కూడా పొందగలుతున్నారని, ఈ విధానం దేశానికే ముప్పులాంటిదని విమర్శించారు. రాష్ట్రం ఎదుర్కొంటున్న మరొక కీలక సమస్య మాదకద్రవ్యాలేనని, పాఠశాలలు, కళాశాలల వద్దే మాదక ద్రవ్యాలను అమ్ముతున్నారని, ఈ సమస్యకు పరిష్కారమేమిటో కనుగొనాలని ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు.

### ఓర్వలేకే విమర్శలు: మంత్రి ఉదయనిధి

రాష్ట్ర విద్యావిధానం దేశంలోనే అత్యుత్తమమైనదని, ఈ విషయాన్ని ఓర్వలేక కడుపుమంటతోనే కొందరు పనిగట్టుకుని విమర్శలు చేస్తున్నారంటూ రాష్ట్ర యువజన సంక్షేమం, క్రీడాభివృద్ధి శాఖల మంత్రి ఉదయనిధి పేర్కొన్నారు. మరైమలర్ నగర్‌లో డీఎంకే నాయకుడి వివాహ వేడుకల్లో పాల్గొన్న ఉదయనిధి మాట్లాడుతూ భారతదేశంలోనే నాణ్యమైన విద్యావిధానం రాష్ట్రంలో అమలు చేస్తున్నారని, తమిళ సిలబస్ చదివిన వారంతా ప్రస్తుతం ఉన్నతమైన ఉద్యోగాల్లో స్థిరపడ్డారని, రాష్ట్ర విద్యావిధానంలో చదివినవారిలో చాలా మంది శాస్త్రవేత్తలుగా, వైద్యనిపుణులుగా ఖ్యాతి గడిస్తున్నారని చెప్పారు. కొంతమంది కడుపుమంటతో ఈ వాస్తవాన్ని అంగీకరించలేక రాష్ట్ర విద్యావిధానంపై పసలేని విమర్శలు చేయడం గర్హనీయమని పరోక్షంగా గవర్నర్‌కు కౌంటర్ ఇచ్చారు. రాష్ట్ర విద్యావిధానాన్ని విమర్శించేవారంతా రాష్ట్రంలోని గురువులందరినీ అవమానించినవారవుతారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర విద్యావిధానంలో చదివిన వారే భవిష్యత్తులో ఉన్నత స్థితికి చేరుకుని ఉత్తమ పౌరులుగా ఖ్యాతిగడిస్తారని ఆయన నొక్కి వక్కాణించారు.

## వైద్యుల పోస్టులను
# భర్తీ చేశాం

- ఈపీఎస్‌కు మంత్రి సుబ్రమణ్యం కౌంటర్



ఎగ్మూరు ప్రభుత్వ కంటి ఆస్పత్రి వద్ద మీడియాతో మాట్లాడుతున్న ఆరోగ్యశాఖ మంత్రి ఎం. సుబ్రమణ్యం

చెన్నై, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులను, సిబ్బంది పోస్టులను ఎప్పటికప్పుడూ భర్తీ చేస్తూనే ఉన్నామని ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం వెల్లడించారు. స్థానిక ఎగ్మూరులోని ప్రభుత్వ కంటి ఆస్పత్రిలో గురువారం ఉదయం జరిగిన కార్యక్రమంలో నేత్రదానం చేసినవారికి ఆయన సత్కారం చేసి ప్రశంసాపత్రాలను అందజేశారు. ఆ సందర్భంగా మీడియా సమావేశంలో అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్)కు కౌంటర్ ఇచ్చిన ఆయన మాజీ ముఖ్యమంత్రి ఈపీఎస్ ప్రభుత్వ శాఖల్లో ఏం జరుగుతుందో తెలుసుకున్న తర్వాతే విమర్శలు, ఆరోపణలు గానీ చేయాలని, ప్రస్తుతం మూడేళ్లుగా వైద్యుల పోస్టులను భర్తీ చేయలేదని ఆరోపించడం గర్హనీయమన్నారు. గత అన్నాడీఎంకే ప్రభుత్వ హయంలో ఆందోళనలో పాల్గొన్న వైద్యులపై బదలీవేటు వేశారని, కాంట్రాక్టు వైద్య సిబ్బంది సమస్యలను ఏ మాత్రం పట్టించుకోలేదని ఆరోపించారు. డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 1947 అసిస్టెంట్ డాక్టర్ల పోస్టులను భర్తీ చేసిందని, మూడేళ్లలో 6700లకు పైగా డాక్టర్ల పోస్టులను కూడా భర్తీ చేసినట్లు ఆయన వివరించారు. అదే విధంగా వైద్యుల విజ్ఞప్తి మేరకు మూడేళ్లలో 36 వేలమందిని వారు కోరుకున్న ప్రాంతానికి బదిలీ చేసింది కూడా డీఎంకే ప్రభుత్వమేనని మంత్రి సుబ్రమణ్యం తెలిపారు.

# పారాలింపిక్స్ విజేతలకు ఘన స్వాగతం



ప్యారీస్, సెప్టెంబరు 5: పారిస్ వేదికగా జరిగిన పారాలింపిక్స్‌లో పతకాలు సాధించి నగరానికి చేరుకున్న అథ్లెటిక్స్‌లకు విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. పారీస్‌లో గత నెల 28వ తేదీ నుంచి ఈ నెల 8వ తేదీ వరకు దివ్యాంగుల 17వ పారాలింపిక్స్ క్రీడా పోటీలు జరుగుతున్నాయి. ఇందులో భారత తరపున పాల్గొన్న 84 మంది క్రీడాకారులు ఇప్పటివరకు 4 బంగారం, 8 రజతం, 10 కాంస్య పతకాలను కైవసం చేసుకున్నారు. ఇందులో బ్యాడ్మింటన్ సింగిల్స్ విభాగంలో కాంచీపురం జిల్లాకు చెందిన తులసిమతి రజతం, మనూషా కాంస్య పతకాలను సాధించారు. అదేవిధంగా బ్యాడ్మింటన్ సింగిల్స్‌లో హోసూర్‌కు చెందిన నిత్యశ్రీ వెండి పతకాన్ని గెలుచుకుంది. ఈ ముగ్గురు విజేతలు బుధవారం రాత్రి పారిస్ నుంచి విమానంలో ఢిల్లీ మీదుగా గురువారం ఉదయం నగరానికి చేరుకున్నారు. వీరికి రాష్ట్ర క్రీడాభివృద్ధి శాఖకు చెందిన ఉన్నతాధికారులు పుష్పగుచ్చాలు ఇచ్చి ఘన స్వాగతం పలికారు.

## సమాచార దర్శిని

### ప్లస్‌టూ విద్యార్థుల వివరాలు సమర్పించండి
● హెచ్‌ఎంలకు ఆదేశం

ఐసిఎఫ్, సెప్టెంబరు 5: ప్లస్‌వన్, ప్లస్‌టూ పబ్లిక్ పరీక్షలు రాయనున్న విద్యార్థుల వివరాలు సమర్పించాలని ప్రధానోపాధ్యాయులకు పరీక్షల విభాగం ఉత్తర్వులు జారీ చేసింది. విద్యార్థుల పేరు, ఫొటో, పుట్టిన తేదీలను సమర్పించాలని, అదే విధంగా పుట్టిన తేదీల్లో ఏవైనా సవరణలుంటే www.dge.tn.gov.in వెబ్‌సైట్‌లో ఎస్‌ఎస్‌ఎల్‌సీ మార్కుల జాబితా నకలును జత పరిచి ఈ నెల 10వ తేదీ లోపు సమర్పించాలని పేర్కొంది.

### రేపు కశ్మీర్‌పై ప్రత్యేక ఉపన్యాసం

ఐసిఎఫ్, సెప్టెంబరు 5: కాశ్మీరు సంస్కృతి, పారంపర్య ఖ్యాతిని వివరించే 101 ఉపన్యాస కార్యక్రమం శనివారం రాత్రి 7 గంటలకు జరుగనుంది. 'నా దృష్టిలో కాశ్మీర్ - మన స్వర్గం' అనే శీర్షికన బయోమెడికల్ ఇంజనీరు స్వామినాథన్ ప్రత్యేక ఉపన్యాయం చేయనున్నారు. కంచి మఠం ఆధ్వర్యంలో జరిగే ఆ కార్యక్రమం మాధ్యమ ధర్మ సమాజం యూట్యూబ్ ఛానల్లో ప్రత్యక్ష ప్రసారం కానుంది. అదే విధంగా కామకోటి ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాల్లోనూ వీక్షించవచ్చని నిర్వాహకులు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

### చవితికి కిరాణా కాంబో ప్యాక్
● సహకార దుకాణాల్లో విక్రయం

ఐసిఎఫ్, సెప్టెంబరు 5: వినాయక చవితిని పురస్కరించుకుని సహకార దుకాణాల్లో కిరాణా సరుకుల 'కాంబో' ప్యాక్ విక్రయాలు ప్రారంభమయ్యా యి. ట్రిప్లికేన్, కాంచీపురం సహకార శాఖ దుకాణాల్లో రూ.199కి 500 గ్రాముల బెల్లం, 500 గ్రాముల కుడుముల పిండి, 250 గ్రాముల శెనగలు, 50 గ్రాముల నెయ్యి, 100 గ్రాముల సగ్గుబియ్యం, 5 గ్రాముల ఏలకులు, 10 గ్రాముల జీడిపప్పు, 10 గ్రాముల ద్రాక్ష, 85 గ్రాముల సేమియా, 50 గ్రాముల నువ్వులు కలిగిన ప్యాక్ విక్రయిస్తున్నారు. అలాగే 12 వస్తువులు కలిగిన ప్యాక్ రూ.299, రూ.399, రూ.499 ధరలకు లభిస్తున్నాయి.

### 14న గ్రూప్-2 ప్రిలిమినరీ పరీక్ష

ఐసిఎఫ్, సెప్టెంబరు 5: గ్రూప్ 2, 2ఏ ప్రిలిమినరీ పరీక్ష ఈ నెల 14వ తేదీన జరుగనుంది. మొత్తం 327 ఖాళీ పోస్టుల భర్తీకి జూన్ 20వ తేదీ తమిళనాడు పబ్లిక్ సర్వీస్ కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు స్వీకరణ జులై 19వ తేదీతో ముగియగా, రాష్ట్ర వ్యాప్తంగా ప్రిలిమినరీ పరీక్షకు 7,93,962 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ నెల 14వ తేదీ జరుగనున్న పరీక్షకు హాల్ టిక్కెట్లు కూడా విడుదల చేసినట్లు పబ్లిక్ సర్వీస్ కమిషన్ అధికారులు తెలిపారు.

### వైష్ణవాలయాల సందర్శనకు బుకింగ్ ప్రారంభం

ఐసిఎఫ్, సెప్టెంబరు 5: నగరంలోని వైష్ణవాలయాల సందర్శనకు టిక్కెట్ బుకింగ్ ప్రారంభమైంది. ఒక్క రోజు ఆధ్యాత్మిక యాత్ర పథకంలో భాగంగా చెన్నైలో ప్రసిద్ధిచెందిన ట్రిప్లికేన్ పార్థసారథి, సింగపెరుమాళ్ కోయిల్, తిరునీర్‌మలై నీర్‌వణ్ణపెరుమాళ్ ఆలయం తదితరాలను సందర్శించుకోవచ్చు. వాలా రోడ్డు నుంచి ఉదయం 8.30 గంటలకు బయలుదేరే బస్సు ఆలయాల సందర్శన అనంతరం మళ్లీ ఇక్కడికే వచ్చి ఆగుతుంది. ఔత్సాహికులు 044-25333333, 25333444 నెంబర్లలో సంప్రదించవచ్చు.

### తిరుత్తణి హుండీ ఆదాయం రూ.కోటి

ఐసిఎఫ్, సెప్టెంబరు 5: తిరుత్తణి మురుగన్ ఆలయ హుండీ ఆదాయం రూ.కోటి సమకూరింది. ఈ ఆలయానికి రాష్ట్రం నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు వస్తుంటారు. స్వామివారికి భక్తులు సమర్పించే ఈ కానుకలను ప్రతి నెలా లెక్కిస్తుంటారు. ఆ మేరకు గత 18 రోజుల్లో రూ.1 కోటి 7 లక్షలా 66 వేలా 917 నగదు, 332 గ్రాముల బంగారం, 11.615 గ్రాముల వెండి ఆభరణాలు, వస్తువులను భక్తులు కానుకగా సమర్పించినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

### తమిళ భాషా సాహిత్య పరీక్ష కోసం దరఖాస్తులాహ్వానం

ఐసిఎఫ్,సెప్టెంబరు5:తమిళ భాషా సాహిత్య సమీక్ష పరీక్షకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. అక్టోబరు 19న జరుగనున్న ఈపరీక్షలో ఉత్తీర్ణులయ్యే 1500 మంది విద్యార్థులను ఎంపికచేసివారికి పాఠశాల విద్యాశాఖ రెండు సంవత్సరాలకు నెలకు రూ.1500 వంతున ఆర్థిక సహాయం అందజేయనుంది. రాష్ట్రంలోని ప్రభుత్వ గుర్తింపు పొందిన అన్ని పాఠశాలల్లో నిర్వహించే ఈ పరీక్ష కోసం ప్లస్‌వన్ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. టెన్త్ సిలబస్ మేరకు పరీక్ష నిర్వహిస్తారు.

### 8న అల్లూరి 127వ జయంతి
● క్షత్రియ కుటుంబాల ఆత్మీయ కలయిక

చెన్నై, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మన్నెం వీరుడు, విప్లవజ్యోతి అల్లూరి సీతారామరాజు 127వ జయంతి వేడుకలను పురస్కరించుకుని ఈ నెల 8వ తేదీన క్షత్రియ కుటుంబాల ఆత్మీయ కలయిక జరుగనుంది. అశోక్‌నగర్‌లో వున్న కాశి ఎస్టేట్స్‌లో ఈ కార్యక్రమాలు జరుగనున్నాయి. ఇందులో భాగంగా ప్రముఖ నటుడు విజయ్ నటించి, తాజాగా విడుదలైన చిత్రం కూడా ప్రదర్శించనున్నారు. వివరాలకు 8248106951, 9444556600, 9444226848 మొబైల్ నెంబర్లలో సంప్రదించవచ్చు.

### వండలూరు ఔటర్ రింగురోడ్డులో టూ వీలర్లకు ప్రత్యేక మార్గం

ఐసిఎఫ్, సెప్టెంబరు 5: స్థానిక వండలూరు - మీంజూరు ఔటర్ రింగురోడ్డులో ప్రమాదాలు తగ్గించేందుకు వీలుగా ద్విచక్రవాహనాల కోసం ప్రత్యేక మార్గం ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర రహదారుల అభివృద్ధి సంస్థ అధికారులు తెలిపారు. నగరంలో ట్రాఫిక్ రద్దీ నియంత్రించేలా వండలూరు - మీంజూరు మధ్య 62.3 కిలోమీటర్ల ఔటర్ రింగురోడ్డు ఏర్పాటు చేశారు. ఈమార్గంలో 30 వేలకుపైగా భారీవాహనాలు,10వేలకు పైగా ద్విచక్రవాహనాలు నడుస్తున్నాయి. చెన్నై, ఎన్నూరు, కాట్టుపల్లి హార్బర్లకు వచ్చివెళ్లే కంటైనర్ లారీల్లో చిక్కుకుని ద్విచక్రవాహన చోదకులు ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ సమస్యను పరిష్కరించేలా టూ వీలర్ల కోసం ప్రత్యేక సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయనున్నారు.

### రాష్ట్రంలో మరో 3 టోల్‌గేట్లు

చెన్నై, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్తగా మూడు టోల్‌గేట్లు ఏర్పాటు చేస్తున్నట్లు జాతీయ రహదారుల సంస్థ ప్రకటన జారీ చేసింది. దీంతో రాష్ట్రంలో టోల్‌గేట్ల సంఖ్య 70కి పెరిగింది. విల్లుపురం జిల్లా నంగినికొండాన్, తిరువణ్ణామలై జిల్లా కరియమంగళం, కృష్ణగిరి జిల్లా నాగంపట్టిలో ఈ టోల్‌గేట్లు ఏర్పాటవుతున్నాయి.కొత్తగా ప్రారంభిస్తున్న నంగిని కొండాన్ టోల్‌గేట్ వద్ద వాహనాలు ఒకసారి వెళ్లేందుకు రూ.60నుండి రూ.400లచొప్పున రుసుము వసూలు చేస్తారు. కరియమంగళం వద్ద వాహనాలు ఒకసారి వెళ్ళేందుకు రూ.55 నుండి రూ.370లు చొప్పున వసూలు చేస్తారు. నాగంపట్టి వద్ద వాహనాలు ఒకసారి వెళ్ళేందుకు రూ.60 నుండి రూ.400ల రుసుము చెల్లించాల్సి ఉంటుందని అధికారులు ప్రకటించారు.

# ఇండియా కూటమిలోనే డీఎంకే
● మున్సిపల్ శాఖా మంత్రి కేఎన్ నెహ్రూ

అడయార్, సెప్టెంబరు 5: కాంగ్రెస్ సారథ్యంలోని ఇండియా కూటమిలోనే డీఎంకే కొనసాగాలన్నదే తమ అభిమతమని రాష్ట్ర మున్సిపల్ శాఖామంత్రి కేఎన్ నెహ్రూ మరోమారు స్పష్టం చేశారు. స్వాతంత్ర్య సమరయోధుడు వీవో చిదంబరం పిళ్లై జయంతిని పురస్కరించుకుని, తిరుచ్చి న్యాయస్థానం సమీపంలో ఉన్న ఆయన విగ్రహానికి మంత్రి కేఎన్ నెహ్రూ గురువారం ఉదయం నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ, కాంగ్రెస్, డీఎంకే తదితర పార్టీలతో కొనసాగుతున్న ఇండియా కూటమికి దేశ వ్యాప్తంగా ప్రజాదరణ పెరుగుతోందని, ఈ కూటమిలోనే డీఎంకే కొనసాగుతుందన్నారు. ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలోని ప్రభుత్వమే భవిష్యత్‌లో జరగబోయే ఎన్నికల్లో మెజారిటీ సీట్లను కైవసం చేసుకుని మళ్లీ అధికారం చేపడుతుందని, తమ కూటమిలోని నేతలందరూ ఏకాభిప్రాయంతోనే ఉన్నారని ఆయన పేర్కొన్నారు. ఇదిలావుండగా, విజయ్ మహానాడుకు డీఎంకే ప్రభుత్వం అనుమతులివ్వలేదని తెలంగాణ మాజీ గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్ విమర్శించారని మంత్రిని మీడియా ప్రశ్నించగా ఆమెనే అడగాలంటూ మంత్రి ఏకవచనంతో సంభోదించడం వివాదాస్పదమైంది.



స్వాతంత్ర్య సమరయోధుడు చిదంబరం పిళ్లైకు నివాళులర్పిస్తున్న మంత్రి కేఎన్ నెహ్రూ

### టీవీకే మహానాడు అనుమతికి జాప్యమెందుకు?
● ప్రశ్నించిన ప్రేమలత

అడయార్, సెప్టెంబరు 5: అగ్రహీరో విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) తొలి మహానాడు నిర్వహణ కోసం అనుమతులివ్వడంలో జాప్యం ఎందుకని రాష్ట్ర ప్రభుత్వాన్ని డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత ప్రశ్నించారు. మదురైలో ఆమె గురువారం మీడియాతో మాట్లాడుతూ, అమెరికాలో ముఖ్యమంత్రి స్టాలిన్ సైకిల్ తొక్కడం, విగ్రహాల ముందు నిల్చొని ఫొటోలు తీసుకోవాడం తమిళ పత్రికల్లో చూస్తున్నామన్నారు. పెట్టుబడుల కోసం విదేశీ పర్యటనకు వెళ్లిన సీఎం ఏ మేరకు పెట్టుబడులు రాబట్టుకున్నారు? ఎంతమందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారు? అనే అంశాలపై స్పష్టత లేదన్నారు. నగరంలో జనసంచారం అధికంగా ఉన్న ప్రాంతంలో ఫార్ములా-4 కార్ రేస్‌కు ఒకే రోజు రాత్రిలో న్యాయస్థానం నుంచి అనుమతి పొందిన రాష్ట్ర ప్రభుత్వం విజయ్ పార్టీ మహానాడుకు అనుమతులివ్వడంతో తీవ్ర జాప్యం ఎందుకు చేస్తుందని ఆమె నిలదీశారు.

### గ్రూపు-1 రిజర్వేషన్ రద్దు కోరుతూ పిటిషన్
● టీఎన్‌పీఎస్‌సీకి హైకోర్టు నోటీసులు

అడయార్, సెప్టెంబరు 5: గ్రూపు-1 పోస్టులకు సంబంధించిన రిజర్వేషన్ రద్దు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను మద్రాస్ హైకోర్టు మదురై బెంచ్ విచారణకు స్వీకరించింది. ఈ మేరకు నోటీసు పంపి టీఎన్‌పీఎస్‌సీ ఛైర్మన్ సమాధానం చెప్పాలని ఆదేశించింది. పుదుక్కోట జిల్లా కీరణూరుకు చెందిన దుర్గ అనే అభ్యర్థి దాఖలు చేసిన పిటిషన్‌లో మార్చి 28న గ్రూపు-1 పరీక్షలకు టీఎన్‌పీఎస్‌సీ ప్రకటన విడుదల చేసిందని, ఇందులో తమిళ మీడియంలో శిక్షణ పొందినవారికి రిజర్వేషన్ కోటా కింది కొన్ని పోస్టులు కేటాయించారని, ఇది చెల్లదంటూ న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేయాలని పిటిషనర్ కోరారు. దీనిపై గతంలో విచారణ జరిపిన న్యాయస్థానం గ్రూపు-1 అర్హత జాబితాలో పారదర్శక పాటించలేదని, ముఖ్యంగా రిజర్వేషన్‌కు సంబంధించి జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వులను వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకునేలా న్యాయస్థానం 2016లో ఇచ్చిన ఉత్తర్వులను టీఎన్‌పీఎస్‌సీ పాటించలేదని పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై గురువారం న్యాయమూర్తి విజయకుమార్ విచారణ జరిపారు. దీనిపై టీఎన్‌పీఎస్‌సీ ఛైర్మన్ సమాధానం చెప్పాలని ఆదేశిస్తూ తదుపరి విచారణను శుక్రవారం వాయిదా వేశారు.

### రిజిస్ట్రేషన్ ఆఫీసుల్లో ఇంటర్నెట్ సేవలకు అంతరాయం

ప్యారీస్, సెప్టెంబరు 5: రాష్ట్ర వ్యాప్తంగా రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ఇంటర్నెట్ సేవలకు అంతరాయం ఏర్పడింది. దీని కారణంగా గత ఆరు రోజులుగా రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. రాష్ట్ర వ్యాప్తంగా రిజిస్ట్రేషన్ శాఖకు చెందిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో భూములు, స్థిరాస్తులు సంబంధించి క్రయ విక్రయాలతో పాటు వివాహాల రిజిస్ట్రేషన్లు జోరుగా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో గత ఆరు రోజులుగా ఈ రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ఇంటర్నెట్ సేవలకు అంతరాయం కలగడంతో రిజిస్ట్రేషన్లు ఆగిపోయాయి.

### 49వ వార్డులో తారు రోడ్డు నిర్మాణం

వేలూరు, సెప్టెంబరు 5: వేలూరు కార్పొరేషన్ 49వ వార్డుకు చెందిన కేకే నగర్ ప్రాంతంలో రూ.5 లక్షలంతో నూతనంగా తారు రోడ్డు నిర్మాణం జరిగింది. కార్పొరేషన్ మేయర్ సుజాత నేతృత్వంలో 49వ వార్డు కార్పొరేటర్ లోకనాథన్ తదితరులు రోడ్డు నిర్మాణ పనులను గురువారం పరిశీలించారు.



### ముగిసిన టీఎంఎంకే, ఎంఎంకే నిర్వాహకుల ఎన్నిక

వేలూరు, సెప్టెంబరు 5: రాణీపేట జిల్లా మేల్‌విశారంలో తమిళనాడు ముస్లిం మున్నేట్ర కళగం (టీఎంఎంకే), మణిదనేయ మక్కల్ కట్చి నిర్వాహకుల ఎన్నిక గురువారం ముగిసింది. ఈ సందర్భంగా స్థానికంగా వివిధ విభాగాలకు చెందిన నేతలను ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల కోసం నిర్వహించిన సమావేశంలో జిల్లా మాజీ అధ్యక్షుడు జనాబ్, ఇతర నేతలు అబ్దుల్ సలీం, ఆషాద్ సాహెబ్, ఇమ్రాన్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల్లో పాల్గొన్న స్థానిక నేతలు

### మాజీ మంత్రి భర్తకు ఐదేళ్ళ జైలు

ప్యారీస్, సెప్టెంబరు 5: అవినీతి కేసులో మాజీ మంత్రి దివంగత ఇందిరా కుమారి భర్త సహా మొత్తం నలుగురికి కింది కోర్టు విధించిన జైలు శిక్షను ఖరారు చేస్తూ మద్రాసు హైకోర్టు గురువారం తీర్పునిచ్చింది. 1991 నుంచి 1996 వరకు అధికారంలో ఉన్న అన్నాడీఎంకే ప్రభుత్వంలో సాంఘిక సంక్షేమ శాఖా మంత్రిగా వ్యవహరించిన ఇందిరా కుమారి, ఆమె భర్త బాబు నిర్వహిస్తున్న ట్రస్టు తరఫున బధిరులకు ఆశ్రయం కల్పించే నిమిత్తం సాంఘిక సంక్షేమ శాఖ తరఫున రూ.15.45 లక్షలు కేటాయించారు. అయితే, ఈ నిధులతో పిల్లలకు ఎలాంటి సంక్షేమ సహాయాలు అందజేయలేదని అప్పటి సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి లక్ష్మీ ప్రాణేశ్ ఏసీబీకి ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు ఇందిరా కుమారి, బాబు దంపతులతో పాటు కృపాకరన్, షణ్ముఖం, వెంకట కృష్ణన్‌లపై కేసు నమోదు చేశారు. నగరంలో ఎంపీ ఎమ్మెల్యేలకు సంబంధించిన కేసులపై విచారణ జరుపుతున్న ప్రత్యేక కోర్టు ఈ కేసు విచారించి ఇందిరా కుమారి దంపతులకు ఐదేళ్ళ జైలుశిక్ష, దివ్యాంగుల పునరావాస సంక్షేమ విభాగం మాజీ కార్యదర్శి షణ్ముగంకు మూడేళ్ళ జైలుశిక్ష విధిస్తూ 2021లో తీర్పునిచ్చింది. ఈ తీర్పును వ్యతిరేకిస్తూ ఇందిరా కుమారి సహా మిగతా నలుగురు మద్రాస్ హైకోర్టులో అప్పీల్‌కు వెళ్ళారు. ఈ కేసు విచారణలో ఉన్న సమయంలో ఇందిరా కుమారి అనారోగ్యం కారణంగా మృతి చెందారు. కాగా, అప్పీల్ కేసులపై న్యాయమూర్తి జయచంద్రన్ విచారించి ఈ కేసులో మృతి చెందిన ఇందిరా కుమారి మినహా మిగిలిన నలుగురికి ప్రత్యేక కోర్టు విధించిన జైలు శిక్షను ఖరారు చేస్తూ తీర్పును వెలువరించారు.

### జాలరి వలలో 350 కేజీల తిరుక్కై చేప

అడయార్, సెప్టెంబరు 5: కడలూరు సమీపంలోని సముద్రంలో జాలరి విసిరిన వలలో అరుదైన ఔషధ గుణం కలిగిన 350 కేజీల తిరుక్కై చేప చిక్కింది. దేవనాంపట్టణం, తాళంగూడ, అక్కరైకోరి తదితర ప్రాంతాలకు చెందిన జాలర్లు ప్రతి రోజూ మరబోట్లు, ఫైబర్ బోట్లలో సముద్రంలో చేపల వేటకు వెళతుంటారు. ఈ నేపథ్యంలో కడలూరు ముత్తు నగర్ సమీపంలోని సముద్రంలో జాలర్లు విసిరిన వలలో ఈ అరుదైన చేప చిక్కింది. ఔషధ గుణాలు కలిగిన ఈ చేపను వేలంపాట ద్వారా కేరళకు చెందిన వ్యాపారులు రూ.20 వేలకు కొనుగోలు చేశారు.

### తమిళనాడు తెలుగు పీపుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విజయవాడలో సహాయాల పంపిణీ



విజయవాడ పరిసర ప్రాంతల్లో ఆహార పొట్లాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

చెన్నై, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): భారీ వరదల కారణంగా తీవ్రంగా నష్టపోయిన విజయవాడ, దాని పరిసర ప్రాంతాల ప్రజలకు 'తమిళనాడు తెలుగు పీపుల్ ఫౌండేషన్' ఆధ్వర్యంలో ఆహారల పొట్లాలు, మంచినీరు, నిత్యావసరాల పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షుడు దేవరకొండ రాజు మాట్లాడుతూ... సర్వస్వం కోల్పోయిన బాధితులను ఆదుకునేందుకు అంతా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ విపత్కర పరిస్థితుల్లో మనమంతా బాధితులకు అండగా వుండాలని విజ్ఞప్తి చేశారు.

### తిరువళ్లువర్ వర్సిటీతో ఎస్‌డీఏ ఒప్పందం



ఒప్పందపత్రాలు మార్చుకుంటున్న అధికారులు

వేలూరు, సెప్టెంబరు 5: వేలూరు జిల్లా సేర్కాడులో వున్న తిరువళ్లువర్ యూనివర్శిటీతో స్కిల్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎస్‌డీఏ) అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంది. వర్శిటీ వైస్‌ఛాన్స్‌లర్ ఆర్ముగం, ఎస్‌డీఏ మేనేజింగ్ డైరెక్టర్ శరవణన్ తదితరులు ఈ ఒప్పంద కార్యక్రమంలో పాల్గొన్నారు. యూనివర్సిటీలో డిగ్రీలు పూర్తి చేసిన విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇవ్వడం, వారికి ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా ఈ ఒప్పందం జరిగినట్లు ఇరువర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ సెంథిల్ వేల్‌మురుగన్, పరీక్షల కంట్రోల్ అధికారి బాబు జనార్ధనం తదితరులు పాల్గొన్నారు.

### లైంగిక వేధింపులను ఎదుర్కోవడంపై సదస్సు



వేలూరు, సెప్టెంబరు 5: వేలూరు జిల్లా కాట్పాడిలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో లైంగిక వేదింపులను ఎదుర్కోవడంపై అవగాహనా సద స్సు జరిగింది. వేలూరు జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సుకు పాఠశాల హెచ్‌ఎం సరళ నేతృత్వం వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై కలైసెల్వి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బాలికలు, మహిళలపై అఘాయిత్యాలు జరిగే అవకాశాలను అడ్డుకునేందుకు 1098 నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

### నేడు విద్యుత్తుండని ప్రాంతాలు

ఐసిఎఫ్, సెప్టెంబరు 5: విద్యుత్ లైన్లలో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు నగరంలోని వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనున్నట్లు అధికారులు తెలిపారు. ఆ ప్రాంతాల వివరాలిలా...

**పల్లిక్కరణై (ఎస్ కొళత్తూర్):** వెస్ట్ అన్నానగర్, పల్లిక్కరణై, ఎస్.కొళత్తూర్, విడుదలై నగర్, 200 అడుగుల రేడియల్ రోడ్డు, వినాయకపురం, మహాకాళియమ్మన్ ఆలయం.

**చెట్‌పేట్:** మెట్ నెక్లెస్ రోడ్, నౌరోజీ రోడ్డు, గురుస్వామి రోడ్డు, పూందమల్లి హైరోడ్డు (డోర్ నెంబరు: 150 నుంచి 200 వరకు, డోర్ నెంబరు: 700 నుంచి 810 వరకు), హారింగ్టన్ రోడ్డు 10, 11 వీధులు, చారి గోశాల, ముత్తప్పవీధి, అరుణాచలం వీధి, వైద్యనాధన్ వీధి, మురుగేశన్ వీధి, పిల్లయార్ ఆలయ వీధి, కందన్ వీధి, అప్పారావు గార్డెన్, అయ్యపురం వెంకటాచలపతి వీధి, సుబ్బరాయన్ వీధి, యాదవ వీధి, తూర్పు మాడవీధి, సభాపతి వీధి, వల్లలార్ వీధి, వీవీ ఆలయ వీధి, పెరుమాళ్ ఆలయ వీధి, ఎస్ఎస్ సాహెబ్ వీధి, సౌత కాసర గార్డెన్, నార్త్ హజరత్ గార్డెన్, అరసమలర్‌తోట్టం, లైం వీధి, కన్నయ్య వీధి, ఈస్ట్ రాజా వీధి, వాసువీధి, రాజారత్నం వీధి, సుబ్రమణ్యం వీధి, న్యూ ఆవడి రోడ్డు, రామనాధన్ వీధి, టైలర్స్ రోడ్డు, మరియాల్ వీధి, టెలిఫోన్ క్వార్టర్స్ తపాలా క్వార్టర్స్, లక్ష్మీ రోడ్డు, రిజర్వు బ్యాంక్ క్వార్టర్స్, తిరువీధి అమ్మన్ ఆలయ వీధి, వీరరాఘవన్ వీధి.

# జీవనశైలిని మార్చేది గణితమే
న్యాయవాది సోలేటి లోకయ్యన్ సుదర్శనం

ప్యారీస్, సెప్టెంబరు 5: గణితం విద్యార్థుల జీవనశైలిని మారుస్తుందని మద్రాస్ హైకోర్టు సీనియర్ న్యాయవాది ఎస్‌కేపీడీ చారిటబుల్ ట్రస్టీ సోలేటి లోకయ్యన్ సుదర్శనం పేర్కొన్నారు. ప్యారీస్ గోవిందప్పనాయకన్ వీధిలో ఉన్న ఎస్‌కేపీడీ బాలుర మహోన్నత పాఠశాలలో ఎస్‌కేపీడీ చారిటీస్, అల్లియన్స్ ఫౌండేషన్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన 'మ్యాథ్స్ కంప్యూటర్ ల్యాబ్' ప్రారంభోత్సవం గురువారం తెలుగు పండిట్ వాకాటి బాలకుమార స్వామి ప్రత్యేక పూజల అనంతరం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్ఎల్ సుదర్శనం మాట్లాడుతూ, గురువులు విద్యాబుద్ధులు నేర్పించి దేశానికి చక్కటి పౌరులు అందించే బాధ్యతను అంకిత భావంతో నెరవేర్చుతున్నారని కొనియాడారు. దాతల సహకారంతో ఎస్‌కేపీడీ నిర్వహణలోని పాఠశాలల్లో గ్రంథాలయాలు ఏర్పాటుచేయించి, విద్యార్థుల ప్రతిభకు పదును పెడుతున్నట్టు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా, ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి అతిథులతో కలిసి విద్యార్థులు పుష్పాంజలి ఘటించారు. ఉపాధ్యాయులకు బహుమతులు, మొక్కలు బహుకరిచాఆరు. ప్రధానోపాధ్యాయురాలు ఓరుగంటి లీలారాణి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో అల్లియన్స్ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ సి.శ్రీకాంత్, ట్రస్టీ ఆర్ కీర్తి వాసన్, కో ఆర్డినేటర్ లావణ్య తదితరులు పాల్గొన్నారు. 6, 7, 8 తరగతుల విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ ఉచితంగా నేర్పించేందుకు వీలుగా శిక్షకులను కూడా ఏర్పాటు చేసినట్టు లీలారాణి వెల్లడించారు.



ఎస్‌కేపీడీ బాలుర మహోన్నత పాఠశాలలో 'మ్యాథ్స్ ల్యాబ్' ప్రారంభిస్తున్న దృశ్యం

### 21 నుంచి చాగంటి ప్రవచనాలు
● 'నిత్య పూజా విధానం'పై ఉపన్యాసం



చాగంటి కోటేశ్వరరావు

చెన్నై, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): 'భారతీ యతా వాహిని' ఆధ్వర్యంలో ఈ నెల 21 నుంచి రెండు రోజుల పాటు ప్రవచన సార్వభౌమ చాగంటి కోటేశ్వరరావు ప్రవచన కార్యక్రమం జరుగనుంది. చెట్‌పేట్‌లోని కుచలాంబాల్ కల్యాణ మహల్‌లో 21, 22 తేదీల్లో సాయంత్రం 6.15 గంటలకు 'నిత్య పూజా విధానం' అనే అంశంపై ఉపన్యాసం వుంటుందని నిర్వాహకులు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులే.

### లంక జైలు నుంచి జాలర్ల విడుదల

ప్యారీస్, సెప్టెంబరు 5: శ్రీలంక జైలు నుంచి విడుదలైన ఏడుగురు తమిళ జాలర్లు గురువారం ఉదయం రామనాథపురం జిల్లా రామేశ్వరం చేరుకున్నారు. రామేశ్వరం ఫిషింగ్ హార్బర్ నుంచి సముద్రంలోకి చేపల వేటకు వెళ్ళిన రాబిన్, సెల్వకుమార్ సహా ఏడుగురిని గత 23వ తేదీ శ్రీలంక నావికా దళ సిబ్బంది అరెస్టు చేసింది. భారత సముద్ర జలాల సరిహద్దులను దాటి చేపలు పడుతున్నారని ఈ జాలర్లను లంక నావికా దళం అరెస్టు చేసింది. ఆ తర్వాత వీరిపై చార్జిషీటు దాఖలు చేసి జాఫ్నా జైలుకు తరలించారు. ఈ నేపథ్యంలో తమిళనాడు ప్రభుత్వం కోరిక మేరకు కేంద్రం జాలర్ల విడుదలకు కృషి చేసింది. దీంతో శ్రీలంక ప్రభుత్వం ఏడుగురు జాలర్లను విడుదల చేయగా వారు కొలంబో విమానాశ్రయం నుంచి బయలుదేరి బుధవారం నగరానికి చేరుకున్నారు. గురువారం ఉదయం వారిని రాష్ట్ర మత్స్య శాఖ అధికారులు ప్రత్యేక వాహనంలో రామేశ్వరానికి సాగనంపారు.

### జంట హత్యల కేసులో ఇద్దరికి రెండు యావజ్జీవ శిక్షలు

అడయార్, సెప్టెంబరు 5: తల్లీ, కుమారుడిని హత్య చేసిన కేసులో ఇద్దరికి రెండు యావజ్జీవ కారాగారశిక్షలు విధిస్తూ తిరునెల్వేలి న్యాయస్థానం తీర్పునిచ్చింది. తిరునెల్వేలి జిల్లా మానూరు సమీపంలోని కురిచ్చకుళంకు చెందిన సుబ్రమణి (45) అనే వ్యక్తి 2010 జూలై 20వ తేదీ రాత్రి పశువులకు మేత వేసేందుకు ఇంటి వెనుక ఉన్న పశువుల పాకకు వెళ్ళాడు. ఆ సమయంలో అదే ప్రాంతానికి చెందిన సిరాజుద్దీన్ ఓ యువతితో ఉండటాన్ని ఆయన చూసి యువతిని మందలించి పంపించేశాడు. దీంతో సిరాజుద్దీన్ కోపంతో మరుసటి రోజు సుబ్రమణి, ఆయన తల్లి గోమతి అమ్మాల్ (65)లను తన అనుచరులతో కలిసి హత్య చేసి పారిపోయాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేయగా, కేసు విచారన తిరునెల్వేలి కోర్టులో జరిగింది. ఈ కేసులోని సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి పద్మనాభన్ నిందుతులు సిరాజుద్దీన్, నాగూర్ మీరాన్‌కు రెండు యావజ్జీవ కారాగార శిక్షలు విధిస్తూ బుధవారం తీర్పునిచ్చారు.

### తొలిసారి జైలుకెళ్ళేవారి కోసం ప్రత్యేక కారాగారం
● హైకోర్టు మదురై బెంచ్ సూచన




ప్యారీస్, సెప్టెంబరు 5: తొలిసారి జైలుకు వెళ్ళేవారి కోసం ప్రత్యేక జైలు ఏర్పాటు చేసే అంశంపై రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సిందిగా మద్రాస్ హైకోర్టు మదురై బెంచ్ న్యాయమూర్తి భరత చక్రవర్తి అభిప్రాయపడ్డారు. ఈ బెంచ్‌లో బెయిల్, ముందస్తు బెయిల్ కోరుతూ దాఖలైన పిటిషన్లను జస్టిస్ భరత చక్రవర్తి విచారణ జరిపారు. గురువారం ఉదయం ఓ కేసు విచారణలో భాగంగా, మదురై సర్కిల్ జైళ్ళశాఖ జాయింట్ డైరెక్టర్ పళని హాజరయ్యారు. ఆ సమయంలో న్యాయమూర్తి స్పందిస్తూ, మదురై సెంట్రల్ జైలుకు తొలిసారి వచ్చే వారి కోసం ప్రత్యేకంగా గది లేదా ఒక చిన్న జైలు ఏర్పాటు చేశారా అని ప్రశ్నించారు. దీనికి పళని సమాధానమిస్తూ, జైలు ఆవరణలో యావజ్జీవ ఖైదీలను ప్రత్యేకంగా, రిమాండ్ ఖైదీలను మరో బ్యారక్‌లో ఉంచే విధానం ఏళ్ళ తరబడి జరుగుతుందన్నారు. తరువాత న్యాయమూర్తి విద్యార్థులు, యువకులు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లను విచారణకు స్వీకరించారు. అపుడు ఆయన చిన్న చిన్న కేసుల్లో జైలుకెళ్ళిన వారు అప్పటికే హత్యలు, హత్యాయత్నం, హత్యాచారం తదితర నేరాలకు పాల్పడి శిక్ష అనుభవిస్తున్న ఖైదీల మధ్య గడపడం వల్ల మళ్లీ నేరాలకు పాల్పడుతున్నారని ఇది పునరావృత్తం కాకుండా, తొలిసారి జైలుకు వెళ్ళేవారికి ప్రత్యేక జైలు ఏర్పాటు చేసే విషయంపై ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని సూచించారు.

### ఊటీలో రెండో సీజన్ ప్రారంభం
● ప్రత్యేక కొండ రైలు సేవలు


అడయార్, సెప్టెంబరు 5: నీలగిరి జిల్లా ఊటీలో రెండో సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో ఈ నెల 7, 8, 14, 15వ తేదీల్లో ప్రత్యేక కొండ రైలు సేవలు అందుబాటులోకి రానున్నాయి. ప్రపంచ ప్రఖ్యాత పర్యాటక కేంద్రంగా గుర్తింపు పొందిన ఊటీలోని ఆహ్లాదరకమైన వాతావరణాన్ని ఆస్వాదించేందుకు సీజన్ రోజుల్లో వివిధ ప్రాంతాకు చెందిన పర్యాటకులు వెళ్తుంటారు. ప్రస్తుతం రెండో సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో పండుగలు, వారాంతపు సెలవు రోజుల్లో కున్నూరు - ఊటీ మధ్య ప్రత్యేక కొండ రైలు సేవలు ఈ నెల 7, 8 తేదీల్లో అదేవిధంగా కున్నూరు - ఊటీ మధ్య 14, 15వ తేదీల్లో అందుబాటులోకి తీసుకుని రానున్నట్టు దక్షిణ రైల్వే అధికారులు తెలిపారు. కున్నూరు నుంచి ఉదయం 8.20 గంటలకు బయలుదేరే రైలు 9.40 గంటలకు ఊటీ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఊటీ నుంచి సాయంత్రం 4.45 గంటలకు బయలుదేరి 5.55కు కున్నూరు చేరుకుంటుంది. ఊటీ - కెత్తి - ఊటీ మధ్య మూడు రౌండ్ల జాయ్ రైడ్ ప్రత్యేక రైలు సెలవు రోజుల్లో నడపున్నారు. తొలి రౌండ్‌లో ఊటీ నుంచి 9.45 గంటలకు బయలుదేరి 10.10 గంటలకు కెతి చేరుకుంటుంది. మరుమార్గంలో ఉదయం 10.10 గంటలకు బయలుదేరి 11.00 గంటలకు ఊటీ చేరుతుంది. రెండో రౌండ్‌లో 11.30 గంటలకు ఊటీ నుంచి బయలుదేరి మధ్యాహ్నం 12.10కి కెత్తి చేరుకుని, అక్కడి నుంచి 12.40కు బయలుదేరి 1.10 గంటలకు ఊటీ చేరుకుంటుంది. ఈ రైలులో ఫస్ట్‌క్లాస్‌లో 80 సీట్లు, సెకండ్ క్లాస్‌లో 130 సీట్లుంటాయి. ఈ రైలుకు ముందుగానే రిజర్వేషన్ సదుపాయం ఉందని దక్షిణ రైల్వే విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది.

### తాంబరం - కొచ్చువెలికి ప్రత్యేక రైలు

అడయార్, సెప్టెంబరు 5: వినాయక చతుర్థి, ఓనం పండుగను పురస్కరించుకుని తాంబరం నుంచి కేరళ రాష్ట్రంలోని కొచ్చువెలి వరకు ప్రత్యేక రైళ్ళు నడుపున్నట్టు దక్షిణ రైల్వే ప్రకటించింది. ఈ నెల 7వ తేదీ శనివారం వినాయక చవితి, కేరళ రాష్ట్రంలో 15వ తేదీ ఓనం పండుగను ప్రజలు జరుపుకోనున్నారు. నగరంలో నివసిస్తున్న కేరళ వాసులు ఓనం పండుగకు సొంతూర్లకు వెళ్ళేందుకు ఈ ప్రత్యేక రైలు నడుపుతున్నారు. ఈ రైలు తాంబరం నుంచి ప్రతి శుక్రవారం 6, 13, 20వ తేదీల్లో రాత్రి 7.30కు బయలుదేరి మరుసటి రోజు తెన్‌కాశికి ఉదయం 5.30 గంటలకు చేరుకుంటుంది. అక్కడ నుంచి 5.37 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 11.00 గంటలకు కొచ్చువెలి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈ నెల 7, 14, 21వ తేదీల్లో ప్రతి శనివారం సాయంత్రం 3.35 గంటలకు ఈ రైలు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7.35 గంటలకు తాంబరం చేరుతుంది. మరో ప్రత్యేక రైలు తాంబరం నుంచి ఈ నెల 8, 15, 22వ తేదీల్లో ప్రతి ఆదివారం రాత్రి 9.45 గంటలకు తాంబరం నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8.15 గంటలకు తెన్‌కాశి చేరుకుంటుంది. అదే రైలు అక్కడ నుంచి ఉదయం 8.15 గంటలకు బయలుదేరి కొచ్చువెలికి మధ్యాహ్నం 1.45కు చేరుకుంటుంది. మరుమార్గంలో ఈ నెల 9, 16, 23వ తేదీలైన సోమవారాల్లో కొచ్చువెలి నుంచి మధ్యాహ్నం 3.35కు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7.35 గంటలకు తాంబరం చేరుకుంటుంది. ఈ రైళ్ళు మేల్‌మరువత్తూరు, విల్లుపురం, విరుదాచలం, అరియలూరు, శ్రీరంగం, తిరుచ్చి, దిండిగల్, మదురై, విరుదునగర్, శివకాశి, శ్రీవిల్లిపుత్తూరు, రాజపాళెయం, శంకరన్ కోయిల్, పాంబు కోవిల్ సంత, కడయనల్లూరు, తెన్‌కాశి, సెంగోట, తెన్‌మలై, పునలూర్, అవనీశ్వరం తదితర స్టేషన్లలో ఆగి వెళతుందని రైల్వే అధికారులు తెలిపారు.


ఆలయ రాజగోపురం


గర్భాలయ గోపురం


ఆలయ అంతరప్రాకారం


ధ్వజస్తంభం

# శత్రుభయ సంహారి... శూలాయుధ ధారి

● సకల భయాలను తొలగించే శివసుబ్రహ్మణ్యస్వామి ఆలయం

● ఆదిదంపతులు తిరునావుక్కరసర్‌కు దర్శనమిచ్చిన క్షేత్రం ● ప్రత్యేక సన్నిధిలో కొలువైన వళ్ళలార్

ఆధ్యాత్మికం

చెన్నై, ఆంధ్రజ్యోతి

తమిళనాట పర్వతాలున్న ప్రాంతాల్లో తమిళుల ఆరాధ్యదైవమైన కుమారస్వామి కొలువై ఉంటాడని చెబుతారు. ఆరుపడై వీడుగా పేరుగాంచిన ఆరు దివ్య క్షేత్రాల్లోనే కాదు, మరిన్ని సుప్రసిద్ధ ప్రాంతాల్లోనూ మురుగప్పెరుమాన్ వెలసి భక్తులను అనుగ్రహిస్తున్నారు. అలాంటిదే కడలూరు జిల్లా పుదువండిపాళయంలో ఉన్న శివసుబ్రహ్మణ్యస్వామి ఆలయం. శత్రు భయాలను పోగొట్టే దివ్యక్షేత్రంగా ఈ ఆలయానికి పేరుంది. ఈ ఆలయం మూడు శతాబ్దాల నాటిది. ఇక్కడ 'వేల్‌కోట్టమ్' ఉంది. ఆదివారం, కృత్తిక, పూస నక్షత్రదినాల్లో ఆ శూలాయుధానికి ప్రత్యేక పూజలు జరుగుతాయి. ఈ శూలాయుధాన్ని పూజించేవారికి సకల సౌభాగ్యాలు కలుగుతాయని, దీర్ఘకాలిక రోగాలు నయమవుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. సుబ్రహ్మణ్యస్వామి పరమేశ్వరుడి వద్ద 'సెండు' అనే ఆయుధాన్ని పొంది మేరుపర్వత గర్వాన్ని అణచిన వేడుకలను, ఆణిమాసంలో శైవభక్తశిఖామణి మాణిక్యవాసగర్ నటరాజస్వామిలో ఐక్యమొందిన వేడుకలను ఈ ఆలయంలో ఘనంగా నిర్వహిస్తారు. మరో శైవభక్తశిఖామణి తిరునావుక్కరసర్‌కు ఒకే సమయంలో పార్వతీపరమేశ్వరులు, సుబ్రహ్మణ్యస్వామి దర్శనమిచ్చిన క్షేత్రంగానూ కీర్తిచెందింది. పూర్వం జైనులు శైవమతాన్ని వ్యతిరేకిస్తున్న రోజుల్లో తిరునావుక్కరసర్ వారిచేతిలో చిత్రహింసలకు గురయ్యారు. జైనుల రాజైన మహేంద్రవర్మడు అతడిని బండరాయికి కట్టి సైనికుల చేత బంగాళాఖాతంలో పడవేశారు. ఆ బండరాయినే తిరునావుక్కరసర్ తెప్పగా మార్చుకుని 'నమఃశివాయ' అనే పంచాక్షరీమంత్రాన్ని జపిస్తూ తిరుప్పాదిరిపుళియూరుకు దక్షిణ దిశగా తేలుతూ వచ్చి కెటిల్ నదీతీరానికి చేరుకున్నారు. ఆ సమయాన వృషభవాహనంలో పార్వతీపరమేశ్వరులు, మయూరు వాహనంలో మురుగప్పెరుమాన్ ఆయనకు దివ్యదర్శనమిచ్చారు. ఆ ప్రకారమే ఈ క్షేత్రంలో మురుగప్పెరుమాన్‌కు ప్రత్యేక ఆలయం నిర్మితమైంది. అప్పర్‌ప్పెరుమాన్ (తిరునావుక్కరసర్) సముద్రంలో తేలియాడుతూ తీరం చేరిన ఘట్టాన్ని ప్రతియేటా చిత్తిరై మాసం అనుష నక్షత్ర పర్వదినాన వేడుకగా జరుపుతారు. అలా ఆ ఆవేడుకలు నిర్వహించేటప్పుడు తిరుపాదిరిపులియూరు పెరియనాయకి సమేత పాటలీశ్వరస్వామి, పుదువండిపాళయం మురుగప్పెరుమాన్ అక్కడ వేంచేసి అప్పర్‌ప్పెరుమాన్‌కు, భక్తులకు అద్భుత దర్శనమిస్తారు.


వేల్‌కోట్టమ్ (శూలాయుధం)

## ఆలయ వైభవం...

ఈ ఆలయంలో ఐదంతస్థుల రాజగోపురం గాంభీర్యంగా దర్శనమిస్తుంది. రాజగోపుర ప్రవేశద్వారానికి ఉత్తరదిశగా ఆదిత్యుడి సన్నిధి, దక్షిణదిశగా చంద్రుడి సన్నిధి ఉన్నాయి. వాటిని దాటి వెళ్తే కంబత్తడి మండపంలో ధ్వజస్తంభం, మయూరవాహనం దర్శనమిస్తాయి. ఇదే విధంగా దక్షిణదిశలో వీరబాహు సన్నిధి, ఉత్తరదిశలో వినాయకుడి సన్నిధి ఉన్నాయి. వీటిని దాటితే అందమైన మహామండపం కనిపిస్తుంది. ఈ మండపంలో కుడివైపు నటరాజస్వామి, శివకామసుందరి కొలువుదీరి ఉన్న తామ్రసభ దర్శనమిస్తుంది. దక్షిణదిశలో పతంజలికి ప్రత్యేక సన్నిధి ఉంది. ఆ తర్వాత అర్థమండపం లోపలకు వెళ్తే ద్వారపాలకులు, వారికి కుడివైపు ఉత్సవమూర్తులు కొలువుదీరి ఉన్నారు. ఉత్సవమూర్తులకు నమస్కరించి లోపలకు వెళితే గర్భాలయంలో శివసుబ్రహ్మణ్యస్వామివారు కుడివైపు వళ్ళిదేవి, ఎడమవైపు దేవసేన సమేతుడై కోడిపుంజు పతాక శూలాయుధాన్ని పట్టుకుని దర్శనమిస్తారు. మహామండపంలోని నటరాజస్వామివారి సన్నిధికి ఎదురుగా, గర్భాలయ గోష్ఠంలో భక్తులంతా 'నాల్వర్'గా పిలిచే శైవభక్తశిఖామణులైన తిరుజ్ఞానసంబంధర్, తిరునావుక్కరసర్, సుందరమూర్తి నాయనార్, మాణిక్యవాసగర్ కొలువైన ప్రత్యేక సన్నిధి ఉంది. ఈ నాల్వర్‌తోపాటు వడలూరు వళ్ళలార్ రామలింగస్వామి కూడా ఉండటం విశేషం. గోష్ఠం కుడివైపు వేల్‌కోట్టమ్ ఉంది. ఎదురుగా కన్నివినాయకర్, ఇడుంబన్ సన్నిధులున్నాయి. ఆ తర్వాత మయూరమురుగన్, నాగనాథర్, ఒకే సన్నిధిలో సరస్వతీదేవి, లక్ష్మీదేవి, వళ్ళి-దేవసేన సమేత ఆరుముగప్పెరుమాన్, గజలక్ష్మి - మహావిష్ణు వేర్వేరు సన్నిధుల్లో దర్శనమిస్తారు. గోష్ఠం ఎడమవైపు సోమస్కందుడు మీనాక్షిదేవి ప్రత్యేక సన్నిధిలో, దక్షిణామూర్తి, చండికేశ్వరుడు, నవగ్రహాలు, భైరవుడి సన్నిధులు దర్శనమిస్తాయి. ఈ ఆలయంలోని శివసుబ్రహ్మణ్యస్వామిని ప్రార్థిస్తే వివాహ ఆటంకాలు తొలగిపోతాయని, సంతానం లేని దంపతులకు సంతానభాగ్యం పొందుతారని, విద్యార్థులు విద్యలో రాణిస్తారని శైవపండితులు చెబుతారు. ఈ మూడు కోరికలు నెరవేరితే భక్తులు స్వామి వారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించి, నూతన వస్త్రాలను ధరింపజేయడం ఆనవాయితీ. అన్ని రకాల మొక్కుబడులకు ఈ ఆలయంలో తులాభారం నిర్వహిస్తారు.

### ఆలయవిశేషాలు..

ఈ ఆలయంలో ప్రతియేటా తైపూస వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ఆ రోజున స్వామివారికి మహా అభిషేకం నిర్వహించి, ప్రత్యేక అలంకారం చేస్తారు. కావడి ఉత్సవాలూ జరుగుతాయి.. తైపూస దినాన ఈ ఆలయంలో వళ్ళలార్ వడలూరు రామలింగ స్వామివారికి కూడా ప్రత్యేక అభిషేకాలు జరిపి, అన్నదానం నిర్వహించడం విశేషం. మాసిమఖం పర్వదినాన మురుగప్పెరుమాన్ దేవనాంపట్టినం సముద్రతీరానికి వేంచేసి తీర్థవారిని అందిస్తారు. పంగుణి మాసం ఆరోతేదీ ఉత్సవంలో తిరుప్పాదిరిపుళియూరు పాటలీశ్వరస్వామి, పెరియనాయకి సమేతుడై ఈ ఆలయంలో వేంచేసి, మురుగప్పెరుమాన్‌కు వివాహం జరిపించి నూతన వధూవరుల సమేతులై ప్రధాన వీధుల్లో ఊరేగుతారు. వయ్యాశి విశాఖ ఉత్సవాలు పది రోజులపాటు వైభవంగా జరుగుతాయి. ఐప్పసి మాసంలో శూరసంహార వేడుకలు ఆరురోజులపాటు అత్యంత వైభవంగా నిర్వహిస్తారు.


శివసుబ్రహ్మణ్యస్వామి

## ఎలావెళ్ళాలి?

చెన్నై సహా పలు ప్రధాన నగరాల నుండి కడలూరుకు రాష్ట్ర రవాణా సంస్థ బస్సులు, ప్రైవేటు బస్సుల నడుపుతున్నారు. పుదువండిపాళయం వెళ్లేందుకు బస్ సదుపాయం లేదు. కడలూరు బస్టాండులో దిగి షేర్ ఆటో లేదా టాక్సీలో ఆ ప్రాంతానికి చేరుకోవచ్చు. ఈ ఆలయాన్ని ప్రతిరోజూ ఉదయం 6 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, మళ్ళీ సాయంత్రం 4 నుండి రాత్రి 9 గంటల వరకు తెరచి భక్తులను దర్శనానికి అనుమతిస్తారు.

'బిగ్ బాస్-8' సీజన్ హోస్ట్‌గా

# విజయ్ సేతుపతి

బుల్లితెర ప్రేక్షకుల్లో ఎంతో ఆదరణ పొందిన 'బిగ్ బాస్' తమిళ రియాలిటీ షో ఎనిమిదో సీజన్‌కు ప్రముఖ నటుడు విజయ్ సేతుపతి హోస్ట్‌గా వ్యవహరించనున్నారు. గత ఏడు సీజన్‌లకు హోస్ట్‌గా వ్యవహరించిన విశ్వనటుడు కమల్ హాసన్ తన బిజీ షెడ్యూల్ కారణంగా ఎనిమిదో సీజన్ నుంచి తప్పుకున్నారు. 'బిగ్ బాస్' హౌస్ నుంచి స్వల్ప విరామం తీసుకుంటున్నాను అంటూ గత నెల 8వ తేదీ ట్వీట్ చేశారు. దీంతో తదుపరి హోస్ట్ ఎవరన్నదానిపై సర్వత్రా ఆసక్తి నెలకొనింది. ఈ నేపథ్యంలో విజయ్ సేతుపతిని ఎంపిక చేశారు. దీనికి సంబంధించిన ప్రోమో తాజాగా విడుదల చేశారు. ఇందులో బిగ్ బాస్ లోగోతో కూడిన సూట్‌తో విజయ్ సేతుపతి చీకట్లో నడుచుకుంటూ వస్తుంటారు. అయితే, ఈ ఎనిమిదో సీజన్ ఎపుడు ప్రారంభమవుతుంది, ఇందులో పాల్గొనే కంటెస్టెంట్స్ ఎవరన్న విషయంపై ఇంకా స్పష్టత రాలేదు.



# కోలీవుడ్ హీరోయిన్‌గా బెంగాలీ భామ!

పలు బెంగాలీ చిత్రాల్లో చిన్న చిన్న పాత్రలు పోషించే సహాయ నటి మేఘాలి మీనాక్షి జాక్‌పాట్ కొట్టింది. కోలీవుడ్‌లో ఏకంగా హీరోయిన్‌గా అవకాశాన్ని దక్కించుకుంది. సీనియర్ దర్శక నటుడు పార్తిబన్ వద్ద అసిస్టెంట్‌గా పని చేసిన వెంకట్ జాన్ కథ సమకూర్చి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. విటల్ రావ్ కదివరణ్, పుగుపేట సురేష్ తదితరులు ఇతర పాత్రలను పోషించారు. ఈ సినిమా గురించి దర్శకుడు వివరిస్తూ, 'సాధారణంగా వీధిలో కిరాణా షాపు నడిపే వ్యక్తి నుంచి ఒక పారిశ్రామికవేత్త ఎదుర్కొనే సమస్యలను ఇతివృత్తంగా తీసుకుని హృదయాన్ని టచ్ చేసేలా సస్పెన్స్ థ్రిల్లర్ జోనర్‌లో ఈ సినిమా స్క్రీన్‌ప్లే కొనసాగుతుంది.అన్ని వర్గాల ప్రేక్షకులు చూసి ఎంజాయ్ చేసేలా ఈ సినిమాను రూపొందిస్తున్నాం. అలాగే, సమాజంలో జరుగుతున్న వివిధ రకాలైన మోసాలపై ప్రజల్లో అవగాహన కల్పించేలా ఈ కథాంశం ఉంటుంది' అని పేర్కొన్నారు.




# యధార్థ సంఘటనతో మూడు భాషల్లో 'ఓం శివం'

చిత్రజ్యోతి

వాస్తవిక కథాంశంతో 'ఓం శివం' పేరుతో కొత్త చిత్రం మూడు భాషల్లో తెరకెక్కనుంది. దీపా ఫిలిమ్స్ పతాకంపై కె.ఎస్.కృష్ణ నిర్మాణ సారథ్యంలో రూపొందే ఈ చిత్రానికి అల్విన్ దర్శకత్వం వహిస్తున్నారు. తమిళం, తెలుగు, కన్నడ భాషల్లో రూపుదిద్దుకోనున్న ఈ సినిమాలో భార్గవ్ హీరోగా నటిస్తుండగా ఈ సినిమా ద్వారా విరానికి హీరోయిన్‌గా తమిళం, తెలుగు పరిశ్రమల్లోకి అడుగుపెడుతున్నారు. ఇతర పాత్రల్లో రవి కాలే, రోబో శంకర్, కాక్రోచ్ సుధి, యాష్ శెట్టి, లక్ష్మి సిద్ధయ్య, అపూర్వ శ్రీ బల్‌రాజ్‌వాడి, ఉగ్రమ్ రవి, వరదన్, రోబో గణేశ్ తదితరులు ఇతర పాత్రలను పోషిస్తున్నారు. ఈ సినిమా గురించి దర్శక నిర్మాతలు మాట్లాడుతూ, 'యధార్థ సంఘటన ఆధారంగా రూపొందిస్తున్నాం. రొమాంటిక్ యాక్షన్ భరిత చిత్రంగా ఖర్చుకు ఏమాత్రం వెనుకాడకుండా నిర్మిస్తున్నాం. ప్రస్తుత కాలంలో ప్రేమ ఒక వన్‌సైడ్ అయినప్పటికీ దాన్ని వెంటనే వ్యక్తం పరుస్తున్నారు. ప్రేమను వ్యక్తం చేసిన వారు వెంటనే ఆ ప్రేమను తిరస్కరిస్తే జీర్ణించుకోలేకపోతున్నారు. 19 నుంచి 20 యేళ్ళ యువకుడు ఒక హీరోయిన్‌తో ప్రేమలో పడతాడు. ప్రేమ కోసం ఏం చేయడానికైనా సిద్ధపడే హీరో జీవితంలో సడెన్ ట్విస్ట్. ప్రియురాలు చనిపోతుంది. దీంతో ఆ యువకుడి జీవితం గాడి తప్పుతుంది. చనిపోతాడు కూడా. ఆ తర్వాత చనిపోయిన ప్రియుడు ఎలా బతికాడు? అతడి ప్రేమను మళ్ళీ దక్కించుకున్నాడా? లేదా అన్నదే ఈ చిత్ర కథ. దీన్ని యాక్షన్‌తో విభిన్న కోణంలో చెప్పాం' అన్నారు. మాండ్య, మైసూర్, తళి, కృష్ణగిరి తదితర ప్రాంతాల్లో 45 రోజుల్లో షూటింగ్ పూర్తి చేసుకున్నారు. ఇదిలావుంటే, నిర్మాత కృష్ణ ఎన్‌కే తన బ్యానరుపై నాలుగు చిత్రాలను నిర్మిస్తుండగా, వాటిలో తొలి ప్రాజెక్టును 'ఓం శివం' పేరుతో చేపట్టారు.



# 'విడుదలై-2' చిత్రానికి ఆర్థిక ఇబ్బందులు?

● సినిమా నిడివి కూడా..

వెట్రిమారన్ దర్శకత్వంలో సూరి, విజయ్ సేతుపతి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'విడుదలై'. గత యేడాది ఈ సినిమా తొలిభాగం విడుదల కాగా, డిసెంబరు నెలలో రెండో భాగం విడుదల చేయనున్నారు. అయితే, ఈ చిత్రానికి రెండు సమస్యలు చుట్టుముట్టాయి. వాటిలో ఒకటి సినిమా నిడివి (లెంగ్త్). రెండోది ఆర్థిక కష్టాలు. నిర్మాణ వ్యయం పెరిగిపోవడంతో సమస్యలు ఉత్పన్నమయ్యాయి. ఎల్‌రెడ్ కుమార్ నిర్మిస్తున్న ఈ చిత్రం తొలిభాగం బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచింది. ఇపుడు రెండో భాగం చిత్రీకరణ శరవేగంగా సాగుతోంది. ఇందులో విజయ్ సేతుపతి పాత్రకు సంబంధించిన నేపథ్యాన్ని చూపించనున్నారు. డిసెంబరు 20వ తేదీ విడుదల చేయాలని ప్రకటించినప్పటికీ ఒక్కసారిగా ఆర్థిక కష్టాలు చుట్టుముట్టినట్టు సమాచారం. పైగా రెండో భాగం నిడివి 4 గంటలకుపైగా ఉన్నట్టు ప్రచారం సాగుతుంది. ప్రస్తుతం షూట్ చేస్తున్న సన్నివేశాలను కూడా కలిపితే ఈ నిడివి మరింతగా పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే, థియేటర్‌కు మాత్రం 2.30 గంటల నిడివితో సినిమా విడుదల చేసి ఓటీటీకి మాత్రం పూర్తి నిడివితో ఉన్న సినిమాను విడుదల చేయాలనే ఆలోచనతో ఉన్నట్టు చిత్ర వర్గాల సమాచారం.


'విడుదలై-2'లో సూరి


చెన్నై మడువిన్‌కరై కార్పొరేషన్ మహోన్నత పాఠశాలలో ఎల్ అండ్ టీ సంస్థ సమకూర్చిన కొత్త బల్లలున్న తరగతిగదిని ప్రారంభిస్తున్న ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం


చెన్నై కొళత్తూరు నేర్మయ్‌నగర్‌లో అగ్నిమాపక కేంద్రం, పోలీసుస్టేషన్ నిర్మించనున్న ప్రాంతాన్ని అధికారులతో కలిసి పరిశీలిస్తున్న మంత్రి పీకే శేఖర్‌బాబు, మేయర్ ఆర్. ప్రియ

గురువారం రాజ్‌భవన్‌లో జరిగిన టీచర్స్‌డే వేడుకల్లో భాగంగా రాష్ట్ర గవర్నర్ ఆర్‌ఎన్ రవి 17 మంది ఉత్తమ ప్రిన్సిపాళ్లను సత్కరించారు. ఈ సందర్భంగా సండిపానిణి విద్యాలయ ప్రిన్సిపల్ భువన శంకర్‌ను సన్మానిస్తున్న దృశ్యం




చెన్నై గిండి గాంధీమండపంలో స్వాతంత్ర్య సమరయోధుడు వా.వు. చిదంబరనార్ 153వ జయంతి సందర్భంగా ప్రభుత్వం తరపున ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రులు సుబ్రమణ్యం, పీకే శేఖర్‌బాబు, సామినాథన్, మేయర్ ఆర్. ప్రియ, డిప్యూటీ మేయర్ మహేష్‌కుమార్ ఇతర అధికారులు

రాజ్‌భవన్‌లో స్వాతంత్ర్య సమరయోధుడు వా.వు. చిదంబరనార్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రాష్ట్ర గవర్నర్ ఆర్‌ఎన్ రవి.



# సర్వేపల్లికి ఘన నివాళి



వేలూరు, సెప్టెంబరు 5: గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్, స్వాతంత్ర్య సమరయోధుడు వీవో చిదంబరనార్‌లకు వీఐటీ యూనివర్సిటీలో ఘనంగా నివాళులర్పించారు. వీఐటీ వ్యవస్థాపకుడు డాక్టర్ విశ్వనాథన్, ఉపాధ్యక్షులు శంకర్ విశ్వనాథన్, వైస్ ఛాన్సలర్, అసోసియేట్ వీసీ, రిజిస్ట్రార్, ప్రొఫెసర్లు, విద్యార్థులు దివంగత నేతలకు నివాళులర్పించారు.

# మహిళా సాధికారత కోసం కృషి

● కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్

చెన్నై, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారత, మహిళా సంక్షేమం కోసం ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్రప్రభుత్వం కృషి చేస్తోందని ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. 'ఫిక్కీ ఫ్లో' ఆధ్వర్యంలో ఇటీవల చెన్నైలో 'ఉమెన్ రైజింగ్: ద అన్‌సీన్ బ్యారియర్స్ ఇన్ పవర్, పాలిటిక్స్ అండ్ అదరవైజ్' అనే అంశంపై జరిగిన ప్రత్యేక సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న నిర్మలా సీతారామన్.. కీలకోపన్యాసం చేశారు. రాజకీయాల్లో మహిళల నేతృత్వం, వివిధ రంగాల్లో వారు ఎదుర్కొంటున్న సవాళ్లు, అడ్డంకులపై మంత్రి ఉపన్యసించారు. లింగ సమానత్వాన్ని సాధించే దిశగా అవగాహన పెంపొందించడానికి, క్రియాత్మక మార్పులను చేపట్టేందుకు ఇది ఒక ముఖ్యమైన వేదిక అని పేర్కొన్నారు. ఫిక్కీ ఫ్లో అధ్యక్షురాలు దివ్య అభిషేక్ నేతృత్వంలో ఈ సదస్సు జరిగింది.


నిర్మలా సీతారామన్‌ను సత్కరిస్తున్న దివ్య అభిషేక్

## చెన్నైలో 'డేల్ కార్నెగియా' శాఖ


శాఖ ప్రారంభోత్సవంలో పల్లవి ఝా, సంజీవ్ నాయర్

చెన్నై, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్ అండ్ లీడర్షిప్ ట్రైనింగ్ సంస్థ 'డేల్ కార్నెగియా' చెన్నైలో మొదటి శాఖ ప్రారంభించింది. వాల్‌చంద్ పీపుల్ ఫస్ట్ లిమిటెడ్ (డబ్ల్యూపీఎఫ్ఎల్)తో కలిసి ఇటీవల ఈ శాఖను ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమంలో డబ్ల్యూపీఎఫ్ఎల్ మేనేజింగ్ డైరెక్టర్ పల్లవి ఝా, తమిళనాడు శాఖ అధినేత సంజీవ్ నాయర్ తదితరులు ఈ శాఖ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు.

# సమాజాభివృద్ధికి వెన్నెముక గురువులే

విశ్రాంత ఉపాధ్యాయుడు వేమా కేశవులు


వేమా కేశవులు, డాక్టర్ పద్మలతను సత్కరిస్తున్న దృశ్యం

ప్యారీస్, సెప్టెంబరు 5: సమాజాభివృద్ధికి ఉపాధ్యాయులే వెన్నెముకవంటి వారని చిన్మయ విద్యాలయ మాజీ ఉపాధ్యాయుడు వేమా కేశవులు పాల్గొన్నారు. షావుకారుపేటలోని కేటీసీటీ ప్రాథమిక మహోన్నత బాలిక పాఠశాలలో గురువారం గురుపూజోత్సవం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ సర్వేపల్లి చిత్రపటానికి ఘన నివాళులర్పించారు. మహోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.అనిల స్వాగతం పలికిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా వేమా కేశవులు, ఆత్మీయ అతిథిగా ఓ.పద్మలత, విశిష్ట అతిథిగా పాఠశాల కరస్పాండెంట్ ఎస్ఎల్ సుదర్శనం హాజరయ్యారు. ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చుక్కా రేవతి, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్న కార్యక్రమంలో భాగంగా, విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

# పాలన చేతగాకే సైకిల్ తొక్కుతున్నారు

● తమిళిసై విసుర్లు


వీవోసీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డాక్టర్ తమిళిసై సౌందరరాజన్

ప్యారీస్, సెప్టెంబరు 5: పాలన చేతగాకే ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, పార్టీని నడపలేక కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సైకిల్ తొక్కుతున్నారని తెలంగాణ మాజీ గవర్నర్, బీజేపీ నాయకురాలు డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ వ్యంగ్యాస్త్రం సంధించారు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు వీవో చిదంబరనార్ 153వ జయంతిని పురస్కరించుకుని హార్బర్ నియోజకవర్గంలో ఉన్న ఆయన విగ్రహానికి గురువారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ... స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న తమిళుల గురించి రాష్ట్ర పాఠ్య ప్రణాళికలో చేర్చాలని కోరారు. 'గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని ఉపాధ్యాయులను గౌరవించడాన్ని విస్మరించి కేంద్ర ప్రభుత్వంపై నిందలు మోపుతూ టీచర్లకు వేతనం ఇవ్వలేమని చెప్పడం రాష్ట్ర ప్రభుత్వ చేతగానితనానికి నిదర్శనమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో రూ.210 కోట్ల విద్యుత్ చార్జీలు చెల్లించలేకపోతున్నారని, ఇలాంటి వారు విద్యార్థులకు ఎలా చదువు చెబుతున్నారో తెలియడం లేదన్నారు. విదేశీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి స్టాలిన్ సైకిల్ తొక్కడంపై స్పందిస్తూ, పాలన చేతకాగ స్టాలిన్, పార్టీని నడపలేక రాహుల్ గాంధీ సైకిళ్ళు తొక్కుతున్నారంటూ ఎద్దేవా చేశారు.


చెన్నై కలైవానర్ అరంగంలో గురువారం సాయంత్రం ఎవర్విన్ గ్రూప్స్ ఆఫ్ స్కూల్స్ ఆధ్వర్యంలో ఏర్పాటైన కార్యక్రమంలో ఆ విద్యా సంస్థల వ్యవస్థాపకులు సీనియర్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.పురుషోత్తం రచించిన 'ది హార్ట్ అండ్ ఆర్ట్ ఆఫ్ టీచింగ్' అనే ఆంగ్ల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రులు పీకే శేఖర్‌బాబు, అన్బిల్ మహేష్ పొయ్యామొళి, ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీ ప్రెస్ ఇండియా ఎండీ సుమంతా దత్తా తదితరులు